సాక్షి
గుంటూరు
మంగళవారం । 11 । జూలై । 2023



పవిత్రోత్సవాలు ప్రారంభం

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో పవిత్రోత్సవాలు సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు.



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి ఆకివీడుకు చెందిన భక్తులు సోమవారం రూ.1.65 లక్షలు విరాళంగా అందజేశారు.



రైతు వ్యథలకు అద్దం

విజయవాడకల్చరల్: డాక్టర్ వైఎస్సార్ కళా పరిషత్ ఆధ్వర్యంలో మొగల్రాజపురం సిద్ధార్థ అకాడమీలో నిర్వహిస్తున్న 43 వ జాతీయ సాంఘిక నాటికల పోటీలు సోమవారం ముగిశాయి.

నీటిమీద తప్పుడు రాతలు

శరవేగంగా గుంటూరు ఛానల్ విస్తరణ పనులు

- ఇప్పటికే రెండు గ్రామాలకు డ్రాఫ్ట్ నోటిఫికేషన్
- అభ్యంతరాలపై ఇంజినీర్ ఇన్ చీఫ్‌తో కమిటీ
- ఇబ్బంది లేదని వచ్చిన నివేదిక
- నాలుగు నెలల్లో భూసేకరణ పూర్తి.. తర్వాత పనులు ప్రారంభం
- అబద్ధాలతో ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం



గుంటూరు ఛానల్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: దశాబ్దాల కల నెరవేరుతున్న వేళ ఆ క్రెడిట్ తమ ఖాతాలో వేసుకునేందుకు విపక్షాలతోపాటు, కొన్ని రైతు సంఘాలు రోడ్డెక్కుతున్నాయి. దీనికి మద్దతుగా అసలు విషయాన్ని మసిపూసి మారేడు కాయ చేసే విధంగా ఎల్లోమీడియా కథనాలు వండి వారుస్తోంది.

గుంటూరు ఛానల్‌ను 1962లో 47 కిలోమీటర్ల మేర నిర్మించారు. తర్వాత కాలంలో పెరిగిన నీటి అవసరాల దృష్ట్యా ఛానల్ సామర్థ్యం పెంచాలని, దీన్ని బాపట్ల జిల్లా పర్చూరు వరకూ పొడిగించాలన్న డిమాండ్ ముందుకు వచ్చింది. గత ప్రభుత్వంలో ఎన్నికల సమయంలో టెండర్లు పిలుస్తున్నట్లు హడావిడి చేసి తర్వాత ఎన్నికల కోడ్ పేరుతో దీన్ని పక్కన పెట్టారు. గత ఏడాది ప్రత్తిపాడు వచ్చిన సమయంలో స్థానిక ఎమ్మెల్యే మేకతోటి సుచరిత గుంటూరు ఛానల్ విస్తరణ అంశాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన దీన్ని పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం దీని విస్తరణ కోసం అడుగులు ముందుకు పడ్డాయి.

ఈ ఛానల్ విస్తరణ వల్ల 48 వేల ఎకరాల ఆయకట్టు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలలో రావడమే కాకుండా మల్లయపాలెం, కాకుమాను మేజర్ల కింద ఉన్న 9,600 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు ఉపయోగపడుతుంది. దీంతో గుంటూరు ఛానల్ 47వ కిలోమీటర్ నుంచి 74.065 కిలోమీటర్ వరకూ విస్తరించాలని నిర్ణయించారు. వట్టిచెరుకూరు మండలంలోని గారపాడు గ్రామం నుంచి పర్చూరు మండలంలోని పర్చూరు వాగు వరకూ ఈ ఛానల్‌ను విస్తరించనున్నారు. ప్రస్తుతం 47 కిలోమీటర్ వరకూ ఉన్న గుంటూరు ఛానల్‌ను ఆధునికీకరించడంతో పాటు కాలువ సామర్థ్యాన్ని పెంచాలని నిర్ణయించారు. దీని కోసం కాలువలో లైనింగ్ పనులు చేయనున్నారు. ఈ పనులు పూర్తయితే కాలవ సామర్థ్యం 600 క్యూసెక్కుల నుంచి 750 క్యూసెక్కులకు పెరుగుతుంది. దీనివల్ల 75 వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉంటుంది. ఈ పనుల కోసం రూ.274.53 కోట్లతో పరిపాలనా అనుమతులు వచ్చాయి. ఈ పనులను మెగా ఇంజినీరింగ్ సంస్థకు అప్పగించారు. ఈ ఛానల్ విస్తరణ వల్ల గుంటూరు జిల్లాలో పత్తిపాడు నియోజకవర్గంలోని పెదనందిపాడు గ్రామంలో 12,523 ఎకరాలు, ప్రత్తిపాడులో 3,232 ఎకరాలు, కాకుమానులో 2,061 ఎకరాలు, బాపట్ల జిల్లాలోని పర్చూరు మండలంలో 20,526 ఎకరాలు, పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట మండలంలో 58 ఎకరాలు మొత్తం 38,400 ఎకరాల కొత్త ఆయకట్టు వస్తుంది. ఈ ప్రతిపాదనలో నక్కవాగు, ఓగేరు వాగులను గుంటూరు ఛానల్ దాటాల్సి ఉంటుంది. దీని కోసం కెనాల్ సైఫాన్, అక్విడక్ట్‌లను ప్రతిపాదించారు. వరదల సమయంలో అదనపు నీటిని ఈ వాగులో కలిపేందుకు వీలుగా 74.025 కిలోమీటర్ వద్ద సర్‌ప్లస్ ఎస్కేప్ రెగ్యులేటర్‌ను తొండివాగు వద్ద ప్రతిపాదించారు. దీని అలైన్‌మెంట్, హైడ్రాలిక్ పర్టిక్యులర్స్‌ను కృష్ణాడెల్టా సిస్టమ్స్ చీఫ్ ఇంజినీర్ ఆమోదించారు. భూసేకరణ కోసం రూ.113.39 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. గుంటూరు జిల్లాలో 389.78 ఎకరాలు, బాపట్ల జిల్లాలో 51.38 ఎకరాలు కలిపి మొత్తం 441.16 ఎకరాలు సేకరించాల్సి ఉంది. దీని కోసం ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. సోషల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ సర్వేకి మినహాయింపు తీసుకువచ్చారు. భూసేకరణ కోసం అలైన్‌మెంట్ చేశారు.

భూసేకరణ కోసం గుంటూరు ఆర్డీఓకు బాధ్యతలు అప్పగించారు. తర్వాత గుంటూరు జిల్లాలోని వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు, పెదనందిపాడులోని 11 గ్రామాలలో భూసేకరణ కోసం ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసింది. అనంతవరప్పాడుతోపాటు రెండు గ్రామాల ప్రజలు ఈ ఛానల్ ఊరుకు పశ్చిమంగా వెళ్తుందని నీరు ఎక్కువ వస్తే తమ ఊళ్లు మునుగుతాయంటూ అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ ఛానల్‌ను ఊరికి తూర్పువైపు నుంచి తీసుకువెళ్లాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఇంజినీర్ ఇన్ చీఫ్‌తో కమిటీ ఏర్పాటు చేసి విచారణ జరిపించారు. ఈ కమిటీ ప్రస్తుత అలైన్‌మెంట్ వల్ల ఇబ్బంది రాదని తేల్చింది. దీంతో ప్రాజెక్టుపై ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. రెండు గ్రామాలకు ఇప్పటికే డ్రాఫ్ట్ డిక్లరేషన్ జారీ చేశారు. మిగిలిన తొమ్మిది గ్రామాలకు కూడా సిద్ధం చేస్తున్నారు. తర్వాత అవార్డు జారీ చేసి, అవార్డు ఫైనల్ అయిన తర్వాత డబ్బులు చెల్లిస్తారు. 2013 భూసేకరణ చట్టం తర్వాత ఇదే పద్ధతిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. అయితే నల్లమడ రైతు సంఘం పేరుతో ముందు డబ్బులు విడుదల చేయాలని, పనులు ప్రారంభించాలని కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్నారు. వాస్తవానికి భూసేకరణ జరగకుండా పనులు చేయడం సాధ్యం కాదని తెలిసినా రాజకీయ ప్రయోజనాల కోసం వారు ఈ ఆందోళన చేయడం దీనికి తెలుగుదేశం, జనసేన పార్టీలు మద్దతు తెలిపి దీన్ని రాజకీయం చేస్తున్నాయి.

త్వరలో భూసేకరణ ప్రక్రియ పూర్తి



గుంటూరు ఛానల్ విస్తరణకు సంబంధించి ఇప్పటికే రెండు గ్రామాలకు డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇవ్వడం జరిగింది. అవార్డు పాస్ అవ్వగానే నిధులు వస్తాయి. ఈ ప్రక్రియ జరగకుండానే నిధులు రాలేదని చెప్పడం సరికాదు. మూడు నాలుగు నెలల్లో భూసేకరణ ప్రక్రియ పూర్తి చేస్తాం. వెంటనే విస్తరణ పనులు మొదలు పెడతాం.

– ఎం.వేణుగోపాల్ రెడ్డి, కలెక్టర్

చిన్నారులు, గర్భిణుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం

కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి



గుంటూరు వెస్ట్: చిన్నారులు, గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించి రక్తహీనతతోపాటు, ఇతర అనారోగ్య సమస్యలను గుర్తించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి నిర్వహించిన అధికారుల సమావేశంలో మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకోవాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో పేదలకు అత్యవసర చికిత్సలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. పాఠశాలల పిల్లల్లో రక్తహీనతను సమీక్షించి హిమోగ్లోబిన్ తగ్గకుండా చూసుకోవాలన్నారు. వసతి గృహాల్లో చిన్నారులకు రక్తశాతం పెంచేందుకు ఐఎఫ్ఏ మాత్రలు క్రమం తప్పకుండా ఇస్తూ పౌష్టికాహారంపై శ్రద్ధ వహించాలన్నారు. వర్షాకాలంలో సంభవించే నీళ్ల విరోచనాలు నివారించేందుకు కాచి చల్లార్చిన నీరు తాగడం, పరిసరాలు శుభ్రంగా ఉంచడం, నీటి నిల్వలు ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవడం, రాత్రిళ్లు దోమతెరలు వాడడం చేయాలన్నారు. అంగన్‌వాడీలు, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది వీటిపై అవగాహన కల్పించాలని సూచించారు. మలేరియా, డెంగీ వ్యాధులపై నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. దీంతోపాటు ఎన్‌సీడీ సర్వేను త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో మధుమేహం, రక్తపోటు, కేసులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వృద్ధులకు డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమం, శుక్లాలు తీయించడం పూర్తి చేయాలన్నారు. మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవం ప్రతి ఒక్కరూ పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డాక్టర్ రత్నమన్మోహన్, డాక్టర్ అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

జిమ్నాస్టిక్ అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గం



గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిమ్నాస్టిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా ఆర్‌పీఆర్ విఠల్, ఎస్.సుబ్బారావులు ఎన్నికయ్యారని ఎన్నికల నిర్వహణ అధికారి ఎన్.సందీప్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యక్షులుగా ఎస్.శ్రీనివాసరెడ్డి, షేక్ షాజియా తారాసుమ్, ఎం.విశ్వేశ్వరరావు, కోశాధికారిగా ఎస్‌వీ శివప్రసాద్‌తో పాటు ఆరుగురు కార్యనిర్వాహక సభ్యులుగా ఎన్నికయ్యారన్నారు. ఎన్నికలు స్థానిక బీఆర్ స్టేడియంలో నిర్వహించామన్నారు. ఎన్నికల పరిశీలకునిగా ఒలింపిక్ అసోసియేషన్ నుంచి బడేటి వెంకటరామయ్య వ్యవహరించారన్నారు. చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారని చెప్పారు.

ప్రకృతి వ్యవసాయంపై ఫ్రాన్స్ విద్యార్థుల అధ్యయనం




తాడేపల్లిరూరల్: ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం చేసేందుకు ఫ్రాన్స్ విద్యార్థులు సోమవారం కుంచనపల్లి విచ్చేశారు. ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల వద్ద నుంచి వారి అనుభవాలను తెలుసుకున్నారు. అనంతరం పెనుమాక గ్రామంలోని రైతు భరోసా కేంద్రానికి వెళ్లారు. ఈ సందర్భంగా డీపీఎం కె.రాజకుమారి రైతులతో సమావేశం నిర్వహించారు. ఫ్రాన్స్ విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయానికి, రసాయన వ్యవసాయానికి మధ్య ఉన్న తేడాలను, ఆదాయ, వ్యయాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఉత్పత్తులలో నాణ్యత, నిల్వసామర్థ్యం తేడాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీఎంయు అదితి, గ్రామీణ వ్యవసాయ అధికారి సాయికృష్ణ, సుమ, రహేల్ పాల్గొన్నారు.

యార్డుకు 41,735 బస్తాల మిర్చి రాక



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 41,735 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 39,273 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,800 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,000 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాలుకు రూ.10,000 నుంచి 23,500 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి రూ. 26,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 14,234 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగర్ నీటిమట్టం వివరాలు



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 519.20 అడుగుల వద్ద ఉంది. ఇది 147.8214 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 1,350 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 808.90 అడుగుల వద్ద ఉంది. ఇది 32.6709 టీఎంసీలకు సమానం.

ఉద్యోగోన్నతి పొందిన టీచర్లు విధుల్లో చేరాలి

- విద్యార్థులను చైల్డ్ ఇన్ఫోలో నమోదు చేయాలి
- జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ



గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయులందరూ సత్వరమే విధుల్లో చేరాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ పేర్కొన్నారు. ఆమె సోమవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తూ స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయులందర్నీ తక్షణమే విధుల నుంచి రిలీవ్ చేయాలని ఎంఈఓలను ఆదేశించారు. రిలీవైన ఉపాధ్యాయులు ఉద్యోగోన్నతి ద్వారా పోస్టింగ్ పొందిన పాఠశాలల్లో విధుల్లో చేరాలని స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 273 మందికి ఉద్యోగోన్నతి ధ్రువపత్రాలను జారీ చేశామని చెప్పారు. అదేవిధంగా జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరి వివరాలు చైల్డ్‌ఇన్ఫో సైట్‌లో ఖచ్చితంగా నమోదు కావాలని, ఈ విషయంలో ఎంఈఓలు తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలలు మారిన విద్యార్థుల వివరాలను కొత్తగా చేరిన పాఠశాలల్లో నమోదు చేసి, డ్రాప్‌బాక్స్‌లను క్లియర్ చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ప్రధానంగా ప్రైవేటు పాఠశాలల పరిధిలో వేర్వేరు పాఠశాలలకు వెళ్లిన విద్యార్థుల వివరాలు డ్రాపౌట్లుగా కనిపిస్తున్న దృష్ట్యా, తక్షణమే సంబంధిత విద్యార్థులను చైల్డ్‌ఇన్ఫోలో నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ పాఠ్య పుస్తకాల కోసం ఆన్‌లైన్‌లో ఇండెంట్ నమోదు చేసి, వాటిని కొనుగోలు చేయాలని ఆదేశించారు. ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న ప్రతి ఒక్క విద్యార్థి దగ్గర ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు ఉండాలని స్పష్టం చేశారు.

చిన్న చిన్న సమస్యలకు సచివాలయాల్లోనే పరిష్కారం

- జాయింట్ కలెక్టర్ రాజకుమారి
- స్పందనలో 157 అర్జీలు స్వీకరణ

గుంటూరు వెస్ట్: గ్రామస్థాయిలో సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసిందని చిన్నచిన్న సమస్యల కోసం జిల్లా కలెక్టరేట్ వరకు రావాల్సిన పనిలేదని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ సచివాలయాల్లో ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు గ్రీవెన్స్ నిర్వహించాలన్నారు. ప్రజల నుంచి అర్జీలు అందగానే శాఖల వారీగా వాటిని సంబంధిత విభాగాలకు పంపాలన్నారు. రానున్న కాలంలో సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ మరింత క్రియాశీలంగా పనిచేయాలని తెలిపారు. అనంతరం వచ్చిన 157 ఫిర్యాదులను జేసీ, డీఆర్‌ఓ చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, జిల్లా అధికారులు పరిశీలించారు.



స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న జేసీ రాజకుమారి

సదరన్ సర్టిఫికెట్ ఇవ్వడంలేదు...



నా కుమార్తె శ్వేతకు పదేళ్ల వయస్సు. పాపకు శారీరక, మానసిక వైకల్యం ఉంది. దీనికి సంబంధించి వైద్యులు సర్టిఫికెట్ ఇచ్చారు. ప్రభుత్వాసుపత్రిలో దీనిని పరిశీలించే విభాగంలేదని, సదరన్ సర్టిఫికెట్ ఇవ్వడం కుదరదని తిరస్కరిస్తున్నారు. పాపకు పింఛన్ వస్తే మాకు కొంత ఆర్థిక భరోసా ఉంటుంది. పేదవారైన మాకు న్యాయం చేయండి.

– ఆర్.రాజారావు, గుంటూరు

బీసీ సంక్షేమ శాఖ భవనం వెంటనే పూర్తి చేయండి



స్థానిక బీఆర్ స్టేడియం వద్ద ఉన్న బీసీ సంక్షేమ శాఖ భవనం నిర్మాణాన్ని నాలుగేళ్ల క్రితం ఆపేశారు. కొద్దిపాటి మరమ్మతులు చేస్తే ఇది అందుబాటులోకి వస్తుంది. బీసీ విద్యార్థులకు ఇబ్బందులు తొలగిపోతాయి. దీనిపై స్పందించండి. బీసీ సంక్షేమ శాఖకు నిధులు కూడా కేటాయించాలి.

– టి.రామకృష్ణ, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు, నాయకులు

నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదజ్వరం!

- జూలై యాంటీ డెంగీ మాసం
- జిల్లాలో 54 డెంగీ కేసులు నమోదు
- మరో రెండునెలలు కేసులు పెరిగే అవకాశం
- ప్లేట్‌లెట్స్‌పై అపోహలు వద్దు



గుంటూరు మెడికల్: వర్షాకాలం వచ్చిందంటే పలు రకాల వ్యాధులు మనిషిపై దాడిచేసేందుకు సిద్ధంగా ఉంటాయి. వర్షపు నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెంది పలురకాల వ్యాధులను వ్యాపింపచేస్తాయి. దోమకాటుతో ప్రజలు పలు జ్వరాల బారినపడే అవకాశం ఉంది. వాటిల్లో ముఖ్యంగా దోమకాటు ద్వారా సంభవించే డెంగీ జ్వరం. దీనిని సకాలంలో గుర్తించి చికిత్స తీసుకోకపోతే ప్రాణాలకే ప్రమాదం. వ్యాధి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం కోసం ప్రతి ఏడాది జూలైను డెంగీ వ్యతిరేక మాసంగా ప్రకటించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

అవగాహన లేకపోతే ఇల్లు, ఒళ్లు గుల్లే...

కరోనా ప్రారంభమైనప్పటి నుంచి జ్వరం పేరు చెబితేనే ప్రజలు హడలెత్తిపోతున్నారు. కరోనా ప్రారంభం కాకముందే డెంగీ జ్వరం ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. పలువురు వ్యాధిపై అవగాహన లేకుండా సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల మృతిచెందిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. డెంగీ జ్వరంపై ప్రజలకు అవగాహన లేకపోతే ఇల్లు, ఒళ్లు గుల్ల కావాల్సిందే. కొన్ని ఆస్పత్రుల్లో ప్లేట్‌లెట్స్ పేరిట జ్వర బాధితుల నుంచి రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. డెంగీపై కొద్దిపాటి అవగాహన కలిగి ఉండి కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే జ్వరం బారిన పడకుండా ఉండవచ్చు.

డెంగీ జ్వరం లక్షణాలు....

పగటి వేళల్లో కుట్టే ఎడిస్ ఈజిప్ట్ అనే దోమకాటు వల్ల డెంగీ జ్వరం వస్తుంది. జ్వరం వచ్చినప్పుడు వాంతులు, తలనొప్పి, కంటి గుడ్డు కదిలినప్పుడు నొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, వాంతి అయినట్లు భ్రాంతి కల్గటం మొదలైన లక్షణాలు కనిపిస్తాయి. ఒంటిపై ఎర్రటి గుల్లలు ఏర్పడి, ప్లేట్‌లెట్స్ తగ్గిపోయి ఒక్కోసారి రక్తస్రావం జరుగుతుంది. రక్తపరీక్ష చేసి ఎలీసా పద్ధతిలో డెంగీ జ్వరాన్ని నిర్ధారణ చేస్తారు.

దోమలు పెరిగే ప్రదేశాలు...

డెంగీ జ్వరాన్ని కలుగజేసే దోమలు మంచినీటిని నిల్వచేసే ప్రదేశంలో పెరుగుతాయి. వాడి పారేసిన వస్తువులు, నిలువ ఉండే నీటిలో దోమ పిల్లలు పురుగుల వలే కదులుతూ ఉంటాయి. నీటిని నిల్వచేసే డ్రమ్ములు, తొట్టెలు, రుబ్బురోళ్లు, వాడి పారేసిన టైర్లు, టీ కప్పులు, ప్లాస్టిక్ కప్పులు, వాడి పారేసిన కొబ్బరి చిప్పలు, బొండాలు, ఫ్రిజ్, ఎయిర్ కూలర్స్ వెనుక భాగాల్లో, పూల కుండీలు, ఓవర్ హెడ్ ట్యాంకులు, నీటి సంపుల్లో దోమ లార్వాలు పెరుగుతాయి.

జిల్లాలో బాధితులు...

జిల్లాలో 2017లో 686 మంది, 2018లో 240 మంది, 2019లో 969 మంది, 2020లో కోవిడ్ కారణంగా 57 మంది మాత్రమే డెంగీ జ్వరం బారిన పడ్డారు. 2021లో 447 మంది, 2022లో 168 మంది, 2023లో జూన్ వరకు 54 మంది డెంగీ జ్వరం బారిన పడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటే మున్సిపాలిటీలు, గుంటూరు కార్పొరేషన్ పరిధిలోనే ఎక్కువగా కేసులు నమోదు అవుతున్నాయి. పెదకాకాని, చేబ్రోలు, తుళ్లూరు, మేడికొండూరు, ఫిరంగిపురం, గుంటూరు రూరల్‌లో 12 కేసులు, గుంటూరు కార్పొరేషన్ పరిధిలోని స్వర్ణభారతినగర్, దాసరిపాలెం ప్లాట్స్, మంగళదాస్‌నగర్, ఎస్వీఎన్ కాలనీ, ఏటుకూరు, నగరంపాలెం, హౌస్సింగ్‌నగర్, ఆర్టీసీ కాలనీ, శ్రీనగర్, నల్లచెరువు, ఆర్.అగ్రహారం, హనుమాన్‌నగర్, తదితర ప్రాంతాల్లో 40 డెంగీ కేసులు, తెనాలి, మంగళగిరి మున్సిపాలిటీల్లో రెండు కేసులు నమోదయ్యాయి.

ప్లేట్‌లెట్స్‌పై అపోహలు వీడండి...



ఎలాంటి జ్వరం వచ్చినా ప్లేట్‌లెట్స్ తగ్గటం సహజం. అంతమాత్రానికే ఊరికినే రోగులు కంగారు పడకూడదు. సాధారణంగా రక్తంలో 2 లక్షల నుంచి 4.5 లక్షల ప్లేట్‌లెట్స్ ఉంటాయి. వీటి సంఖ్య 40 వేల కన్నా తక్కువగా ఉన్నప్పటికీ కూడా ఎలాంటి ప్రమాదం సంభవించదు. మూత్రంలో, కళ్లద్వారా రక్తం పడిపోతూ ఉంటే అప్పుడు మాత్రమే ప్లేట్‌లెట్స్ ఎక్కించాల్సి ఉంటుంది.

– డాక్టర్ నరేంద్ర వెంకటరమణ, జనరల్ ఫిజీషియన్ గుంటూరు

ఉచితంగా వైద్య సేవలు



జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డెంగీ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నాం. ప్రైవేటు వైద్యులందరికీ డెంగీ కేసులు నిర్ధారణ జరిగితే సమాచారం ఇవ్వాలని, ప్లేట్‌లెట్స్ పేరుతో భయపెట్టవద్దని ఆదేశాలు జారీచేశాం. ప్రజలు జ్వరాలపై, ప్లేట్‌లెట్స్‌పై ఉన్న అపోహలు వీడి తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ అమృతలూరి శ్రావణ్‌బాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, గుంటూరు

విదేశీ విద్యకు జీడీసీసీ సహకారం అభినందనీయం

- రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- జగనన్న సహకార విద్యాజ్యోతి పథకానికి శ్రీకారం



సహకార విద్యాజ్యోతి విదేశీ రుణాల మంజూరు పత్రాలను అందిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి

కొరిటెపాడు(గుంటూరు): రైతు బిడ్డల ఉన్నత, విదేశీ విద్యకు రుణాలు ఇచ్చేందుకు ముందుకొచ్చిన గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకును రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అభినందించారు. జగనన్న సహకార విద్యాజ్యోతి పేరిట కర్షక సోదరుల కలలు సాకారం చేసేందుకు గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు రూపొందించిన ప్రత్యేక పథకాన్ని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం బ్యాంకు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి కాకాణి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయ సాధనకై అంచెలంచెలుగా సహకార బ్యాంకులను, సంఘాలను సీఎం వైఎస్ జగన్ బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే లాభాపేక్ష లేకుండా కేవలం రైతులకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా జీడీసీసీ బ్యాంకు ముందుకు సాగుతున్నట్లు ఆయన వివరించారు. రాష్ట్ర సహకార శాఖ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ, గత పాలకుల హయాంలో సహకార రంగం పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. వైఎస్ జగన్ సీఎం అయిన తర్వాతే సహకార వ్యవస్థలో అభద్రతాభావం తొలగిందన్నారు. బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు మాట్లాడుతూ రైతుబిడ్డల విదేశీవిద్యకు వ్యవసాయ భూములు, వారికి సంబంధించిన స్థిరాస్తుల తనఖాపై రుణం ఇస్తున్న ఏకైక బ్యాంకు తమదేనన్నారు. అనంతరం విదేశీ విద్యకు అర్హత పొందిన రైతు బిడ్డలకు మంత్రి స్వయంగా చెక్కులు అందజేశారు. బ్యాంక్ సీఈఓ కృష్ణవేణి, బ్యాంకు పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లాలో 34.1 మి.మీ సగటు వర్షపాతం

దుగ్గిరాలలో 78.8 మి.మీ వర్షం

కొరిటెపాడు(గుంటూరు): జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా దుగ్గిరాల మండలంలో 78.8 మి.మీ వర్షం పడింది. సగటున 34.1 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. కొల్లిపర 70.6, మంగళగిరి 69.4, తాడేపల్లి 52.4, తాడికొండ 43.2, పెదకాకాని 39, తుళ్ళూరు 36.4 గుంటూరు తూర్పు 34.8, చేబ్రోలు 33, గుంటూరు పశ్చిమ 32.4, మేడికొండూరు 22.4, ఫిరంగిపురం 22.2, తెనాలి 21.8, ప్రత్తిపాడు 17.4, పెదనందిపాడు 12.4, వట్టిచెరుకూరు 12.2, కాకుమాను మండలంలో 8.2 మి.మీ చొప్పున వర్షం పడింది.

ఫైనల్ మెరిట్ లిస్ట్ విడుదల

నెహ్రూనగర్: వివిధ శాఖలలో 2022–23 సంవత్సరానికి వివిధ కేటగిరీలకు సంబంధించిన విభిన్న ప్రతిభావంతుల 28 బ్యాక్‌లాగ్ ఉద్యోగాల ఫైనల్ మెరిట్ జాబితాను మంగళవారం జిల్లా అధికారిక వైబ్ సైట్ www.funtur.ap.gov.in గుంటూరు బృందావన్‌గార్డెన్స్ 4వ లైనులోని విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్స్, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయం ప్రజల సౌకర్యార్థమై నోటిసు బోర్డు నందు ఉంచడం జరుగుతుందని ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ సువార్త సోమవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఫైనల్ మెరిట్ జాబితాలో అర్హులైన వారు ఒక్కొక్క పోస్టుకు ఇద్దరు అభ్యర్థుల చొప్పున(1:2) జిల్లా పరిషత్ మీటింగ్ హాల్ గుంటూరు నందు ఈ నెల 15వ తేదిన ఉదయం 10గంటలకు ఒరిజనల్ సర్టిఫికెట్స్ పరిశీలన జరుగుతుందన్నారు.

సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం

- మాజీమంత్రి మేకతోటి సుచరిత
- బీకేపాలెంలో పర్యటన

కాకుమాను: గ్రామస్తులకు సురక్షితమైన రక్షిత తాగునీరు అందించడమే లక్ష్యమని మాజీ హోంశాఖ మంత్రి, ప్రత్తిపాడు శాసన సభ్యురాలు మేకతోటి సుచరిత అన్నారు. స్థానిక శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థాన కళ్యాణ మండపంలో సోమవారం మండలంలోని బీకేపాలెం రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 41లో ఉన్న 16.79 ఎకరాల రెవెన్యూ భూమిని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ బీకేపాలెంలో ఉన్న చంద్రప్ప చెరువుకు సంబంధించిన భూమి రెవెన్యూ భూమిగా రెవెన్యూ,ఇతర అధికారులు గుర్తించినట్లు ఆమె తెలిపారు.16.79 ఎకరాల రెవెన్యూ భూమిలో గ్రామస్థుల సౌకర్యార్థం తాగునీటి చెరువును నిర్మించాలని గతంలో అనేక మార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు ఆమె తెలిపారు. కానీ పలువురు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే సుచరిత

వ్యక్తులు తమ సొంత ప్రయోజనాల కోసం ఆ భూమి తమదేనని వ్యాజ్యానికి వెళ్లినట్లు ఆమె తెలిపారు. చంద్రప్ప చెరువు భూమిలో తాగునీటి చెరువు నిర్మించడం వలన కాకుమాను,పెదనందిపాడు మండలాల్లోని సుమారు 7,8 గ్రామాల ప్రజలకు తాగునీటి సమస్య తీరుతుందని ఆమె తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అందులో భాగంగానే చంద్రప్ప చెరెవు భూమిలో తాగునీటి చెరువును ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. దీని వలన కాకుమాను గ్రామ ప్రజలకు ఎన్నో ఎళ్లగా ఉన్న తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని సుచరిత తెలిపారు. రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ గత 40 సంవత్సరాల నుండి కాకుమాను ప్రజలకు అందని ద్రాక్షాల ఉన్న తాగునీటి సమస్య వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నెరవేతున్నట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో కారుమంచి ప్రసాద్ బాబు, నల్లమోతు వెంకట రత్తయ్య (ఏరీస్) వ్యవసాయ సలహామండలి జిల్లాచైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌వి మతిస్థిమితం లేని మాటలు!

- మహిళల గురించే మాట్లాడే అర్హత ఆయనకెక్కడిదీ?
- వ్యవసాయ, సహకార శాఖ మంత్రి గోవర్ధన్‌రెడ్డి

కొరిటెపాడు(గుంటూరు): పవన్ కల్యాణ్ కనీస ఇంగిత జ్ఞానం లేకుండా మతి స్థిమితం లేని వ్యక్తిగా పూనకం వచ్చిన వాడిలా మాట్లాడుతున్నారని.. ఇప్పటిదాకా ప్యాకేజీ పవన్ అనుకున్న వ్యక్తి నిన్నటి ప్రసంగం చూశాక ప్యాకేజీ పవన్ కాదని.. పిచ్చి పవన్ అని అనిపిస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. గుంటూరులోని జీడీసీసీ బ్యాంక్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళల గురించి మాట్లాడుతున్నారు.. గతంలో ఎవరైతే మా తల్లి గురించి మాట్లాడారని గగ్గోలు పెట్టారో ఈ రోజు వారి దగ్గరే ఉండే పరిస్థితి నీకు దాపురించిందని విమర్శించారు. జనం మాత్రం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఉన్నారని.. సేనాని మాత్రం చంద్రబాబుతో అంటకాగుతున్నావని ధ్వజమెత్తారు. వలంటీర్ల వ్యవస్థను అవమాన పరిచేలా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. వలంటీర్లలో సుమారు 70 శాతం మంది మహిళలు ఉన్నారని, వారి మనోభావలను గాయపరిచే విధంగా నీ ప్రసంగాలు సాగుతున్నాయన్నారు. గతంలో చంద్రబాబు పాలనపై విమర్శలు గుప్పించిన నీవు ఏ నజరానా ఇస్తే ఆయన మెప్పు పొందటానికి నేడు రకరకాల మాటలు మాట్లాడుతున్నావని నిలదీశారు. నీవు వలంటీర్ల వ్యవస్థ, మరో దాని గురించి మాట్లాడిన ప్రతిసారి రాష్ట్ర ప్రజల మనోభావాలు దెబ్బతినటం, గాయపడుతున్నాయన్నారు. లోకేష్ పాదయాత్ర అట్టర్ ఫ్లాప్ అంటూ మీడియా ప్రతినిధులు అడిగిన ఒక ప్రశ్నకు మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి బదులిచ్చారు. సమావేశంలో సహకారశాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, లాలుపురం రాము పాల్గొన్నారు.

రూ. 70 లక్షలతో జీజీహెచ్ గైనకాలజీ వార్డు ఆధునికీకరణ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ గైనకాలజీ వార్డును రూ. 70 లక్షలతో ఆధునీకరించేందుకు సీఐఐ ప్రజారోగ్య అధికారులు సోమవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను కలసి చర్చించారు. జూన్ 13న జీజీహెచ్ గైనిక్ వైద్య విభాగాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజినీతో సీఐఐ ప్రజారోగ్య అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. అందులో భాగంగా సోమవారం డాక్టర్ కిరణ్ కుమార్‌ను కలసి గైనకాలజీ వార్డు ఆధునీకరణపై సమీక్ష చేశారు. కార్యక్రమంలో సీఐఐ ప్రజా ఆరోగ్య శాఖ డెప్యూటీ డైరెక్టర్ నిశాంత్ సాగర్, ప్రతినిధులు బి. శ్రీనివాస్ సతీష్, చంద్ర పట్నాయక్ పాల్గొన్నారు.

వైద్య పరికరాలు విరాళంగా ఇచ్చేందుకు అంగీకారం

ఆసుపత్రికి అవసరమైన పోర్టబుల్ అల్ట్రా సౌండ్ స్కాన్ పరికరం అందించాలని సీఐఐ ప్రతినిధుల్ని డాక్టర్ కిరణ్ కుమార్ కోరగా అందుకు వారు అంగీకరించారు. గర్భస్థ శిశువు గుండె మానిటరింగ్ చేసేందుకు సీటీజీ మిషన్లు నాలుగు ఇవ్వాలని కోరగా దానికి కూడా అంగీకరించారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ సతీష్ కుమార్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అన్ని పరీక్షలు ఉచితమే

గుంటూరు జీజీహెచ్‌లో ప్రతిరోజూ అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'కిట్‌లు లేవు... బయటే చేయించుకోండి'... అంటూ ఓ పత్రికలో వచ్చిన (సాక్షి కాదు) వార్త కథనాన్ని ఆయన ఖండించారు. ప్రతిరోజూ ఓపీ విభాగంలో సెమి ఆటోమ్యాటిక్ మిషన్ ద్వారా 30 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నామన్నారు. అందుబాటులో లేని పరీక్షలు ఆరోగ్యశ్రీ ఒప్పంద ల్యాబ్ ద్వారా 24 గంటలూ ఉచితంగా చేస్తున్నామన్నారు. ఆసుపత్రిలో సదరన్, గ్రీన్ యాపిల్ ఏజెన్సీల వారీ మిషన్లతో వైద్య పరీక్షలు కొంతకాలంగా చేస్తున్నట్లు వెల్లడించారు. సదరు కంపెనీ వారు మార్కెట్ రేటు కంటే అధిక ధరలతో కిట్‌లను విక్రయిస్తున్నారని వెల్లడించారు. గ్రీన్‌యాపిల్, సదరన్ ఏజెన్సీల కంపెనీల మిషన్‌లలో ఇతర కిట్‌లు పెట్టి వైద్య పరీక్షలు చేసేందుకు అనువుగా లేవన్నారు. యూనివర్సల్ మిషన్‌లు, యూనివర్సల్ కిట్‌లు ఆసుపత్రిలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సదరు ఏజెన్సీలకు పాతబకాయిలు చెల్లించి ఈనెల 6న ల్యాబ్‌లో తనిఖీలు చేసి 24 గంటలు ల్యాబ్ పరీక్షలు అందుబాటులోకి తీసుకు రావాలని ఆదేశించామన్నారు. అయినప్పటికీ కిట్‌లను సరఫరా చేసేందుకు గ్రీన్ యాపిల్, సదరన్ ఏజెన్సీల నిర్వాహకులు ముందుకు రాలేదన్నారు. మంగళవారం నుంచి ఎమర్జెన్సీ వార్డులో 24 గంటల ల్యాబ్ మొదలు పెట్టేందుకు చర్యలు తీసుకున్నట్లు డాక్టర్ కిరణ్‌కుమార్ వెల్లడించారు.



సీఐఐ ప్రతినిధులతో సమీక్షిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గంజాయి కేసులో నలుగురు అరెస్టు

మంగళగిరి: గంజాయి కేసులో నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.2 లక్షల విలువైన ద్విచక్ర వాహనంతో పాటు సుమారు రూ.80 వేల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ జేడీ మహేష్ చెప్పారు. నగర పరిధిలోని ఎస్ఈబీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన ఇరువురు కుంచనపల్లిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నారు. వీరు మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారి ఒడిశాలో ఉన్న కొంత మంది గంజాయి స్మగ్లర్లతో పరిచయాలు పెంచుకున్నాడు. గంజాయిని ఏపీకి అక్రమంగా రవాణా చేస్తూ విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నిఘా పెట్టిన ఎస్ఈబీ అధికారులు మెరుపుదాడి నిర్వహించి వారిద్దరితోపాటు గంజాయి కొనుగోలు చేసిన మరో ఇరువురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి 2.20 కిలోల గంజాయి, రూ.2 లక్షల విలువైన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను విచారించిన ఎస్ఈబీ అధికారులకు విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. జల్సాలకు అలవాటు పడి పలువురు మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నట్లు గుర్తించడం జరిగిందని, వారిపై నిఘా ఏర్పాటు చేసి త్వరలోనే మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఈఎస్ అన్నపూర్ణ, సీఐ మారయ్య బాబు, ఎస్ఐ మల్లికార్జున్ సిబ్బంది పాల్గొన్నారు.

దొరికిపోయిన పాత నేరస్తుడు

- నాలుగేళ్ల తరువాత హత్య కేసులో నిందితుడి అరెస్టు
- గుంటూరు సౌత్‌జోన్ డీఎస్పీ ఎండీ. మహబూబ్ బాష

ప్రత్తిపాడు: హత్య చేసిన నాలుగేళ్ల తరువాత నిందితుడు పోలీసులకు చిక్కాడు. నిందితుడికి కనీసం మొబైల్ ఫోన్ గానీ, ఆధార్ కార్డు గానీ లేకపోవడం, ఎలాంటి సాంకేతిక ఆధారాలు లభ్యంకాకపోవడంతో కేవలం నిఘా వ్యవస్థపై ఆధారపడి నిందితుడిని పోలీసులు అరెస్టు చేసిన ఘటన ఇది. ప్రత్తిపాడు పోలీస్ స్టేషనులో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ ఎండీ. మహబూబ్ బాష కేసు వివరాలను వెల్లడించారు. పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం గోళ్లపాడు గ్రామానికి చెందిన సాని వెంకటరావు 2019లో నవంబరులో గుంటూరు జిల్లా ప్రత్తిపాడుకు కూలి పనుల నిమిత్తం భార్య సీతారావమ్మను అనుమానంతో దారుణంగా హత్య చేసి పరారయ్యాడు. ఈ మేరకు సీతారావమ్మ కుమారుడు వెంకటేష్ ఇచ్చిన పిర్యాదు మేరకు ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎట్టకేలకు సోమవారం నిందితుడు ఇంట్లో ఉన్నాడన్న సమాచారం అందుకున్న ప్రత్తిపాడు పోలీసులు వెంకట్రావును అదుపులోనికి తీసుకున్నారు.

బేషరతుగా క్షమాపణ చెప్పాలి

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ డిమాండ్

పట్నంబజారు: వలంటీర్ల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నిందలు మోపడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ మండి పడ్డారు. బృందావన్‌గార్డెన్స్‌లోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏలూరు బహిరంగ సభలో పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం, ప్రజల మధ్య సమన్వయంతో సంక్షేమ పథకాలను పేదలకు అందిస్తూ నిస్వార్థంగా ముందుకు సాగుతున్న వలంటీర్లపై నీలాప నిందలు మోపడం సరికాదన్నారు.

నోరు అదుపులో పెట్టుకో.. పవన్ కల్యాణ్ !

వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు పోలూరి వెంకటరెడ్డి



గుంటూరు లీగల్: జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ నోరు అదుపులో పెట్టుకోవాలని, వలంటీర్లుపై విషం చిమ్ముతే సహించేది లేదని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు, గుంటూరు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పోలూరి వెంకటరెడ్డి హెచ్చరించారు. వారాహి విజయ యాత్రలో భాగంగా ఏలూరు బహిరంగ సభలో పవన్‌కల్యాణ్ వాలంటీర్లను ఉద్దేశించి చేసిన ఆరోపణపై పోలూరి స్పందించారు. సోమవారం వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వాలంటీర్లకు రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు అండగా నిలుస్తారని తెలిపారు.

బంగారం కోసమే హతమార్చాడు!

వివరాలు వెల్లడించిన ఎస్పీ ఆరిఫ్ హఫీజ్



నగరంపాలెం: నగలు కోసం ఓ వృద్ధురాలిని అత్యంత కిరాతంగా హత్య చేసిన యువకుడ్ని కొత్తపేట పోలీసులు అరెస్ట్ చేశారు. హత్యకు ఉపయోగించిన సుత్తి, స్క్రూడ్రైవర్, రూ.88 వేలు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ కె. ఆరిఫ్‌హఫీజ్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను ఎస్పీ వెల్లడించారు. ఈనెల 2న గుంటూరువారితోట లో అద్దెకు ఉంటున్న వేనుగంటి విజయలక్ష్మీ (65) దారుణ హత్యకు గురైంది. మృతురాలి కుమార్తె జ్యోత్స్న కొత్తపేట పోలీసులకు ఫిర్యాదివ్వగా, అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ యూనిట్, సీసీఎస్, కొత్తపేట, పెదకాకాని, నల్లపాడు పోలీసులు బృందాలుగా ఏర్పడి, విస్తృతంగా గాలించారు. సీసీటీవీ ఫుటేజీ, పాత నేరస్తుల కదలికలు ఇతరత్రా అంశాలపై లోతుగా విచారించారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా హత్యకు పాల్పడిన వ్యక్తిని గుర్తించి, ఒంగోలు, విజయవాడ, గుంటూరులో గాలించారు. ప్రకాశం జిల్లా తాళ్ళూరు మండలం శివరామపురం గ్రామవాసి రావిపాటి జగదీష్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతన్ని అరెస్ట్ చేశామన్నారు. రూ.88 వేలు, సెల్ ఫోన్, సుత్తి, స్క్రూడ్రైవర్ స్వాధీనం చేసుకున్నారు.

చిన్న చోరీలతో..

గతంలో జగదీష్ ఒంగోలులో ఇంటర్‌లో చేరి మానేశాడు. అయిదేళ్లు కూలీ పనులకెళ్ళాడు. 2021లో ప్రేమ పెళ్లి చేసుకోగా, ప్రస్తుతం అతను ఒంటరి. గతంలో అతని మోటారుసైకిల్‌ను రూ.30 వేలకు తనఖా పెట్టి, తర్వాత బైక్ ఎత్తుకెళ్లాడు. జగదీశ్‌పై పోలీసులకు ఫిర్యాదివ్వగా, అప్పట్నుంచి ఊరి నుంచి పరారయ్యాడు. కోళ్ల పందెలు, చెడు వ్యసనాలకు బానిసై, చిన్న చోరీలు చేసేవాడు. ఒంగోలు, గుంటూరు లాడ్జిల్లో బస చేసేవాడు. గతంలో అతనిపై బెల్ట్‌షాప్ కేసు నమోదైంది. ఇటీవల ఒంగోలులో సుత్తి, స్క్రూడ్రైవర్ కొనుగోలు చేశాడు. ఈనెల 2న గుంటూరువారితోటలో ఒంటరిగా ఉన్న విజయలక్ష్మి వద్ద బంగారు గొలుసు తెంచే ప్రయత్నంలో ఆమె అడ్డుకుంది. దీంతో వెంట తెచ్చుకున్న సుత్తితో ఆమె తలపై పలుమార్లు బలంగా మోదడంతో తుదిశ్వాస విడిచింది. ఆమె వద్ద చోరీ చేసిన బంగారం ఒంగోలులో తనఖా పెట్టి రూ.1.43 లక్షలు తీసుకుని, జల్సాలు చేశాడు. ఈ క్రమంలో అరెస్ట్ చేశామన్నారు. కేసుని త్వరితగతిన చేధించిన ఏఎస్పీలు ఎస్.షెల్కే (గుంటూరు తూర్పు) ఎ.శ్రీనివాసరావు (క్రైం), డీఎస్పీ ప్రకాష్‌బాబు (క్రైం), సీఐలు షేక్.అన్వర్‌భాషా (కొత్తపేట పీఎస్), బండారు సురేష్ (పెదకాకాని పీఎస్), సీసీఎస్ సీఐలు డి.వెంకన్నచౌదరి, బెల్లం శ్రీనివాస్, ఎస్ఐలు షేక్.ఎండీ.మేరాజ్, శ్రీనివాసరావు (కొత్తపేట పీఎస్), సీసీఎస్ ఎస్ఐలు ఆరోగ్యరాజు, బాబురావు, నల్లపాడు ఎస్ఐ అశోక్, ఏఎస్ఐలు, హెచ్‌సీలు, పీసీలకు ప్రశంసపత్రాలను ఎస్పీ అందించారు.

ఉద్యోగం పేరుతో మోసగించాడు

ఎస్పీకి ఫిర్యాదు



బాధితుల సమస్యలు ఆలకిస్తున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్, పక్కన ఏఎస్పీ సుప్రజ

నగరంపాలెం: ఉద్యోగం ఇప్పిస్తానని తెలిసిన ఓ వ్యక్తి లక్షల్లో కాజేసినట్లు ఓ యువకుడు జిల్లా పోలీస్ స్పందనలో ఫిర్యాదు చేశారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని స్పందన హాల్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక–స్పందన (గ్రీవెన్స్) జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల అర్జీదారులు వచ్చారు. జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ ఫిర్యాదులను స్వీకరించారు. బాధితుల బాధను ఆయన ఆలకించారు. ఫిర్యాదిదారుల ఎదుటనే సంబంధిత సబ్ డివిజన్లు, పోలీస్‌స్టేషన్ల పోలీస్ అధికారులతో మొబైల్ ఫోన్‌లో/ జూమ్ ద్వారా ఎస్పీ మాట్లాడారు. స్పందన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

చదువుతో ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చు

భారత క్రికెటర్ అంబటి రాయుడు



ప్రసంగిస్తున్న అంబటి రాయుడు

తాడేపల్లిరూరల్: విద్యార్థులు చదువుతో ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని భారత క్రికెట్ అంబటి రాయుడు అన్నారు. సోమవారం ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లి గీతాంజలి స్కూల్ ఇన్వెస్టర్ డే సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. అంబటి రాయుడు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకుంటే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని, చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు.

సీతానగరంలో పూజలు

తాడేపల్లిరూరల్ : భారత క్రికెటర్ అంబటి రాయుడు సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని పలు కార్యక్రమాల్లో పాల్గొని సాయంత్రం కృష్ణాతీరంలో వున్న శ్రీ కోదండరామ అభయ ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన రాకను పురస్కరించుకుని ఆలయ అధికారులు ఆయన ఘనస్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.